
# కౌన్ బనేగా... 'రోడ్'పతి

శాఖమూరి శ్రీనివాస్



రాత్రి తొమ్మిది గంటలు దాటింది. ఆ ఫ్లాట్‌లోని టివిలో సవాళ్లు విసురుతోన్న లేడీ విలన్ వాయిస్. తనపై కక్షతీర్చుకోవద్దని బ్రతిమాలుతోన్న పురుష హీరో దీనాలాపన! టివి ఎదురుగా ఆసీనులైన శలభారావు, ద్రవ్యమణిల కన్నీటితో సోఫా సగం తడిసిపోయింది. ద్రవ్యమణి చీరంచుతో శలభం, అతని లుంగీ అంచుతో మణి కళ్లొత్తుకున్నారు. దొరికితే లేడీ విలన్ తాట తీసేలా ఉన్నారు. విలన్ వాయిస్ ఇంకా పెరిగింది. హీరో కాళ్లు పట్టుకుంటున్నాడు. మణి ఇక తట్టుకోలేకపోయింది. ఘొల్లుమంటూ శలభం గుండెపైపడి శోకాలు తీయసాగింది. ఒక్కసారి టన్నురాయి గుండెల్ని గుద్దుకున్నట్లు కళ్లు తేలేశాడు శలభం.

''ఊరుకో మణి..కష్టాలు మనుషులకు కాక మానులకొస్తాయా..వచ్చే ఎపిసోడ్‌లో చూడు! ఆ విలన్ పొగరు ఎలా అణగదీస్తాడో మన హీరో..'' అంటూ భార్యను ఓదార్చసాగాడు. ఇంతలో సెల్ కూనిరాగం తీసింది. ''హలో'' అన్నాడు శలభం. అవతల్నించి చతురమూర్తి వాయిస్.

''రేయ్ శలభా.. ఏం చేస్తున్నావు? ఆ దిక్కుమాలిన కంట్లో కన్నీళ్లుండవు' డైలీ సీరియల్ చూస్తున్నావు కదూ! నీవు మారవురా.. ఈ జన్మకు మారవు. అఖండమైన తెలివితేటలు, అమోఘమైన బుర్ర పెట్టుకుని కూడా నిన్ను నీవు మార్చుకోవు. పూర్‌ఫెలో..నీతో స్నేహం చేసిన పాపానికి నేనైనా నిన్ను మార్చేందుకు ప్రయత్నించాలి కదా..''

చతురమూర్తి వాగ్ధాటిని అడ్డుకుంటూ ''విషయమేంటో చెప్పరా.. టెన్షన్‌తో చంపకు. నాకు మాత్రం మారాలని ఉండదా! మార్పు కోరుకోనివాడు మనిషే కాదురా. ప్రకృతిలోని ప్రతిప్రాణీ మార్పు కోరుకుంటుంది. మారాలని, మార్పుకావాలని కోరుకోనిది ప్రాణం లేని బండరాయి మాత్రమే. మార్పుతోనే మనిషిలో చైతన్యం వెల్లివిరుస్తుంది. మార్పులోనే మనిషి జీవకణాలు పునరుజ్జీవనం పొందుతాయి.''

శలభం మాటల్ని అడ్డుకుంటూ ''కాసేపు నోర్మూయ్.. బుద్ధిగా చెప్పేది విను. ఈ మధ్యే 'నక్షత్ర మైనస్' ఛానల్లో వారానికి మూడురోజులు కౌన్‌బనేగా రోడ్ పతి అనే కొత్త ప్రోగ్రామ్ మొదలెట్టారు. ప్రముఖ సినిమా నక్షత్రం అజిత్‌భాయ్ యాంకర్! ఈరోజది వస్తోంది. వెంటనే ఛానల్ మార్చి చూడు. అంతా అర్థమవుతుంది. వివరాలు రేపు మాట్లాడుకుందాం. ఉంటాను. బాయ్..'' అని ఫోన్ కట్ చేశాడు చతుర.

మణి మాత్రం శలభాన్ని పట్టించుకోకుండా కన్నీళ్లు కార్చడంలో మునిగి ఉంది.

''మణీ..నీ మొహంలో ఆనందాన్ని నింపుతానుండు.'' అని ఛానల్ మార్చి 'నక్షత్ర మైనస్' పెట్టాడు శలభం.

ఓ పదినిముషాలు చూడగానే ప్రోగ్రామ్ చాలా వరకు అర్థమయింది. అజిత్ భాయ్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, వేడి ఆసనం పైని వ్యక్తి లక్షల్లో డబ్బు గెలిచేస్తున్నాడు. చతురమూర్తికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు శలభం..అంత మంచి కార్యక్రమం గురించి చెప్పినందుకు.

చిన్నప్పట్నించీ తను క్లాస్ ఫస్ట్. అంతేకాదు. స్నేహితులందరిలోనూ మొదట ఉద్యోగం పొందింది కూడా తనే! ఆఫీస్‌లో షార్ప్ బ్రెయిన్‌గా గుర్తింపు పొందింది ఎవరు? ఇంకెవరూ తనే! తన గొప్పతనమంతా మెదడులో రివ్యూ అయ్యేసరికి ఒడలు పులకించాయి శలభానికి.

మణికేమీ అర్థం కాలేదు. అజిత్‌భాయ్ హిందీలో మాట్లాడుతుండడంతో వచ్చింది సమస్య. భర్త ఆనందాన్ని షేర్ చేసుకోలేక తెల్ల మొహం వేసింది. శలభం భార్య పరిస్థితి గమనించి అంతా వివరించి చెప్పాడు. ప్రోగ్రామ్ కాన్సెప్ట్ అర్థం కావడంతో గా..ట్టిగా కేకేసింది మణి. వైర్లలో కరెంట్ ఒక్కక్షణం ఆగి ప్రవహించింది. శలభం కూడా ఒక్క క్షణం ఊపిరి తీసుకోవడం మర్చిపోయాడు. భార్య కేక సంతోషంతో వేసిందేనని నిర్ధారించుకున్నాక గుండె కుదుటబడింది.

ఉదయం నిద్రలేవగానే శలభానికి రాత్రి కల గుర్తుకొచ్చింది. తనేమో వేడి ఆసనంపై కూర్చుని వేడివేడిగా సమాధానాలిస్తోంటే ఆశ్చర్యపోయి చెక్కులు రాసేపనిలో మునిగాడట అజిత్‌భాయ్! చెక్కులు రాసీరాసీ చెయ్యి నొప్పి పెడుతోందని జోక్ చేశాడట. ఒక్క హెల్ప్ లైనూ తీసుకోకుండానే పదిహేను ప్రశ్నలకు జవాబులు చెప్పి రెండు కోట్లు కొట్టేశాడట! శలభం ప్రతిభకు అచ్చెరువొంది నక్షత్ర మైనస్ వాళ్లు మరో రెండు కోట్లు బోనస్‌గా ఇచ్చారట. ఆ డబ్బుల్ని మా బాంక్‌లోనే డిపాజిట్ చేయండంటూ బాంకర్లు బ్రతిమాలుతున్న సమయంలోనే.. మెలకువ వచ్చింది.

'ఎంత మంచికల! ఏదో అతీంద్రియ శక్తి నా అదృష్టాన్ని ముందుగానే చూచాయగా చెబుతోంది. ఈ అవకాశాన్ని పోగొట్టుకోకూడదు. పోరాడితే పోయేదేం లేదు. బట్టతలపైని మిగిలిన వెంట్రుకలు తప్ప..'' అని గట్టిగా నమ్మి రెట్టింపైన ఆత్మవిశ్వాసంతో ఆఫీసుకు వెళ్లాడు శలభం.

ఓ గంట ముందే ఆఫీస్‌కు దగ్గర్లోని రెస్టారెంట్లో వాలిపోయాడు. ముందే ఫోన్‌చేసి చెప్పడంతో చతుర కూడా వచ్చాడు.

''ఏరా ఏం నిర్ణయించుకున్నావు?'' శలభాన్ని అడుగుతూనే బేరర్ని పిలిచాడు చతుర.

బేరర్‌కు ఆర్డరిచ్చి పంపాక, ''నిర్ణయించుకోవడానికి మీనమేషాలు లెక్కబెట్టే తత్వం కాదు నాది. తాడో పేడో తేల్చుకునే రకం. ఒక ఆశయం కోసం పనిని ప్రారంభించాక వెనకడుగు వేయడం మా ఇంటా వంటా లేదు. వెనకడుగు వేసేవాడు పిరికిదద్దమ్మ, చవట. వెనక్కి తిరగడం ఆత్మహత్యా సదృశం. నో కాంప్రమైజ్ ఇన్ దిస్ ఇష్యూ..'' రొప్పుతూ కాస్త ఆపాడు శలభం.

తనేమో వేడి ఆసనంపై కూర్చుని వేడివేడిగా సమాధానాలిస్తోంటే ఆశ్చర్యపోయి చెక్కులు రాసే పనిలో మునిగాడట అజిత్ భాయ్! చెక్కులు రాసీరాసీ చెయ్యి నొప్పి పెడుతోందని జోక్ చేశాడట. ఒక్క హెల్ప్ లైనూ తీసుకోకుండానే పదిహేను ప్రశ్నలకు జవాబులు చెప్పి రెండు కోట్లు కొట్టేశాడట!

''దానికంత లెక్చర్ అవసరమా? దేనికెంత అవసరమో అంతే మాట్లాడరా.. నాలోని టాలెంట్, ఇంటెలిజెన్స్ నాకు తెలుసు. బట్, ఈ అనవసర ప్రసంగాలతోనే అసలు విషయం మరిచిపోతావేమోనని భయం.''

''సరేరా..నానోటిని అదుపులో ఉంచుకుంటానులే. ఆ ప్రోగ్రామ్‌లోకి ఎలా ఎంటర్ కావాలో, దానికి మన ప్రయత్నాలేమిటో చెప్పలేదు నీవు. త్వరగా చెప్పు .. ఆత్రుతగా ఉంది..'' శలభం ముఖంలో ఉద్విగ్నత.

''ఓకె. చెబుతాను. ముందు టిఫిన్ తిననివ్వు.'' అంటూ ఎదురుగా ఉన్న ప్లేట్లపై దాడి చేశాడు చతుర. శలభానికి తన ఆత్రుత ముందు ఆకలి గుర్తుకు రాకపోవడంతో ప్లేట్లోని రెండు ఇడ్లీలను స్పూన్‌తో వందల, వేల ముక్కలు చేయసాగాడు. ఆ ముక్కలు గిన్నిస్ బుక్ వారి దృష్టిలో పడలేదు. తిండి అయిపోయేంత వరకూ చతుర మాట్లాడడని తెలుసు. ఓ అర్ధగంట తర్వాత ఖాళీ అయిన ఇరవై ప్లేట్ల సాక్షిగా బ్రేవ్ మని తేన్చాడు చతుర.

అతని తేపు ఆనందరాగంలా ఉంది శలభానికి.

''ఇకనైనా చెప్పరా..'' దీనంగా అడిగాడు.

''తొందరపడితే ఎలావోయ్. ఏయ్, బేరర్ రెండు కాఫీ..'' అని ఆర్డరిచ్చి. ఏదో రహస్యం చెప్పేవాడిలా టేబుల్‌పైకి ఒంగాడు చతుర.

కాఫీ తాగుతూనే, ఓపావుగంట సేపు ఆ ప్రోగ్రామ్‌కు వెళ్లడానికి చేయాల్సిన ఫోన్ నెంబర్లు, ఎస్.ఎమ్.ఎస్‌ల వివరాలు కూలంకషంగా చెప్పాడు.

కప్పులోని చివరి కాఫీ బొట్టుకూడా కంప్లీట్ కాగానే, ''వెళదాం పద, త్వరగా ఫోన్‌చేద్దాం..'' శలభం లేవబోయాడు.

''రేయ్..దేనికి అంత తొందర. ఈరోజు, రేపు రోడ్‌పతి ప్రోగ్రామ్‌కు బుకింగ్ సెలవు. ఎల్లుండి ఉదయం నించే నీ తడాఖా చూపుదువులే. ముందు ఓ ప్రణాళిక తయారు చేసుకో. అన్నీ దాని ప్రకారమే పక్కాగా ఉండు. ప్రిపరేషన్ ఈజ్ మోస్ట్ ఇంపార్టెంట్. ప్రిపేర్ కాకుండా వెళ్లినా ఒట్టి చేతుల్తో తిరిగి రావడమే. ఈరోజంతా బాగా ఆలోచించుకో. వెనకడుగు మాత్రం వెయ్యొద్దు.'' ఆఫీస్ వైపుకు నడుస్తూ ఉద్బోధ చేసేశాడు చతుర.

సాయంకాలం ఇంటికి రాగానే, అటకపైని అట్టపెట్టెల్ని కిందికి దించాడు శలభం. ముక్కులు మూసుకుని తడిగుడ్డతో మట్టిని, బూజును తుడిచాక మెల్లగా ఓపెన్ చేశాడు. ఒక పెట్టెలోంచి మిలమిలా మెరుస్తూ కొత్తగా కనిపిస్తోన్న ఓ వెయ్యి పేజీల బౌండ్‌ను బయటికి లాగాడు. 'ఎ బుక్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్' అన్న అక్షరాలు దానిపై బంగారు వర్ణంలో మెరిసిపోతున్నాయి.

దాన్ని పట్టుకోగానే ట్రాన్స్‌లోకి వెళ్లాడు. ''ఐ.ఎ.ఎస్. అవుదామన్న సదాశయంతో తను అన్ని పుస్తకాల్నీ సమకూర్చుకున్నాడు. అప్పుడే మొదలయ్యింది అడ్డంకుల పర్వం. ఉన్న ఉద్యోగం చాలని కొందరు, స్వర్గానికి నిచ్చెనలని మరికొందరు. ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక మానసిక ఇబ్బందులన్నీ కలిసి తన ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు వేశాయి. గుమాస్తాగిరినే సెటిల్ చేశాయి. లేకుంటేనా.. లేకుంటేనా..''

అతని బట్టతలపై ద్రవ్యమణి ఒక గాట్టి మొట్టికాయ వేయడంతో ఇహలోకంలోకి వచ్చాడు.

''ఏంటా మతిమరుపు చేష్టలు. ఇలాగైతే కోట్లు గెలిచినట్టే'' ఎత్తిపొడిచింది మణి.

''ఓనా పిచ్చిమణీ..వాటికోసమేనే ఈ తంటాలన్నీ. ఈ పుస్తకం చూశావా! ఎంతోమంది జీవితాలను మార్చింది. దురదృష్టవశాత్తు దీనిని పూర్తిగా చదవకపోవడంతో నా బ్రతుకు ఇలా ఏడ్చింది. ఇప్పుడు దీని అవసరం మళ్లీ వచ్చింది. ముందు ముందు నువ్వే చూస్తావు దీని ఉపయోగమేంటో.'' అని ఆ పుస్తకాన్ని బల్లపై పెట్టి అట్టపెట్టెల్ని మళ్లీ అటక అనే జమ్మిచెట్టు మీద ఉంచాడు.

స్నానం చేసి వచ్చి తన ఐయ్యేయస్ పుస్తకంలోని ఐదారు పేజీలను ఏకాగ్రతతో ఆపకుండా చదివాడు. భర్త పట్టుదల చూసి ద్రవ్యమణి ముచ్చటపడింది.

త్వరగా భోజనం ముగించి ఇద్దరూ రోడ్‌పతి ప్రోగ్రామ్‌ను చూడసాగారు. ప్రోగ్రామ్ గంభీరంగా చతురోక్తులతో సాగుతోంది. అజిత్‌భాయ్ యాంకరింగ్ అద్భుతంగా ఉంది. పోటీదారుడు కూడా చురుగ్గా సమాధానాలిస్తున్నాడు. నాలుగయ్యాక ఐదో ప్రశ్నను స్క్రీన్ పై చూపాడు అజిత్‌భాయ్. కంటెస్టెంట్ తికమకపడి హెల్ప్‌లైన్ అడిగాడు. శలభానికి నవ్వొచ్చింది. అంత చిన్న ప్రశ్నకు సమా

ధానం తెలీనివాడు వేడి ఆసనం దాకా ఎలా వచ్చాడో అర్థంకాలేదు.

"మణీ. ఆ ప్రశ్నకు సమాధానం నేను చెబుతాను. జవాబు వచ్చాక పోల్చి చూసుకో." అని ఒంగి భార్య చెవిలో జవాబు చెప్పాడు.

హెల్ప్‌లైన్ తీసుకున్నా తప్పు జవాబు చెప్పి ఆసనధారుడు పోటీ నుంచి తప్పుకున్నాడు. అజిత్ భాయ్ చెప్పిన సమాధానం విని మణి బిత్తరపోయింది. ఆయన చెప్పినజవాబు, భర్త చెవిలో చెప్పిన జవాబు ఒకటే.

"ఇప్పుడు చదివిన పుస్తకంలోని మొదటిపేజీలోనే ఉందా జవాబు. చూశావుగా పుస్తక మహిమ." శలభం మాటలు విన్న మణి బల్లపైని పుస్తకాన్ని శ్రద్ధగా కళ్లకద్దుకుంది.

***

సాయంత్రం ఆఫీస్‌టైమ్ కాగానే కోఠికి వెళ్లాడు శలభం. పుస్తకాల షాపుకు వెళ్లి ఓ నాలుగు కొత్త, పాత జి.కె. పుస్తకాలు కొన్నాడు.

ఇంటికొచ్చాక తెచ్చిన పుస్తకాలను మణికి చూపి, వాటిని ఐ.ఎ.ఎస్ పుస్తకంతో కలిపి విజయం నాదే అన్నట్లు విక్టరీ సింబల్ చూపాడు.

ఇన్నాళ్లూ బద్ధకస్తుడనుకున్న భర్త నూతన ఉత్సాహాన్ని చూసి మంచిరోజులు వచ్చాయనుకుంది మణి. ఇక రేపట్నుంచి ఫోన్‌లు, ఎస్.ఎమ్.ఎస్ లతో హోరెత్తించాలి." అనుకుని పుస్తకాలు చదువుతూనే ఏ అర్ధరాత్రో అపరాత్రో నిద్రలోకి జారాడు.

మరుసటి రోజు ఉదయం నుంచే కోటి కోసం వేట మొదలయ్యింది. ఫోన్లు. ఎస్ఎమ్ఎస్‌లతో ఎంట్రీకోసం ప్రయత్నించసాగాడు శలభం. ఉదయం లేచిన దగ్గర్నించి పడుకోబోయే వరకూ ఎలా ప్రిపేర్ కావాలో ఓ షెడ్యూల్ తయారు చేసుకున్నాడు.

రోజూ పడుకోబోయే ముందు ఆ రోజు చదివిన ప్రశ్నలకు సమాధానాలను మణికి అప్పజెప్పాలి. అది కండిషన్! అనుకున్నట్లుగానే ప్రిపరేషన్ సాగుతోంది. మణికూడా భర్త చెప్పే సమాధానాల పట్ల సంతృప్తిగానే ఉంది. రోడ్‌పతి ప్రోగ్రామ్‌ను ఇద్దరూ మిస్ కాకుండా చూస్తున్నారు. టివిలోని పోటీదారుల కంటే ఎక్కువ ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు చెప్పేస్తున్నాడు.

ఓవారం గడిచాక.. ఆఫీస్‌కు చతుర వచ్చాడు. ఆ సమయంలో శలభమొక్కడే వాక్‌మన్ వింటున్నాడు. మిగతా స్టాఫంతా షరామామూలు. రెస్టారెంట్ల దగ్గర డ్యూటీ చేస్తున్నారు. చెవిలోని వాక్‌మాన్ చూసి చతురకు చిరాకేసింది.

ఇయర్ ఫోన్స్ లాగి, "ఏరా.. ఏం చేస్తున్నావు. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఏడవచ్చుగా. అవకాశాలు మళ్లీ మళ్లీ రావు. ఇప్పుడు కోటీశ్వరుడివి కాకపోతే తలక్రిందులుగా తపస్సు చేసినా నీ జీవితకాలంలో కాలేవు. ఏం వింటున్నావా?" చెవులు పట్టుకు ఊపుతూ అడిగాడు.

"చతురా..నీవింతగా చెప్పాలా! ఇలా చెబితే అలా అల్లుకుపోవడం మా వంశంలో మొదటినించీ ఉన్నదే. అవకాశాల కోసం ఎదురుచూడడం కాదు. అవకాశాలు సృష్టించుకోమన్నారు పెద్దలు. ప్రాప్తకాలజ్ఞత ప్రదర్శించడం నాకు తెలుసులే. నీలా మట్టిబుర్ర కాదు. నీ తలపై క్రాక్స్‌లేవుగాని, ఉండుంటే ఎప్పుడో ఓ మర్రి చెట్టో, రావిచెట్టో మొలిచి ఉండేది. చేపట్టిన పనిని నిబద్ధతతో, చిత్తశుద్ధితో చేయడం మొదటినుంచీ మాకున్న అలవాటు."

మాటల్ని మధ్యలో బ్రేక్ చేస్తూ..'' శ...ల...భా...'' గాండ్రించాడు చతురమూర్తి.

చప్పున నోరు మూసుకుని "నే వింటున్నదేమిటో నీవే విను. విషయం అర్థమవుతుంది." అని ఇయర్‌ఫోన్స్ తగిలించి ప్లే బటన్ నొక్కాడు.

కాసేపు విని సంతృప్తిగా తలాడించాడు చతుర. అదొక జనరల్ నాలెడ్జ్ కాసెట్. రోడ్‌పతి ప్రోగ్రామ్ కొరకు ప్రత్యేకంగా తయారైంది.

కాసేపు అది చూడగానే పరిస్థితి అర్థమయింది. ఆఫీస్ పేపర్ల వెనుకవైపు ఖాళీలో మణికి చెప్పలేకపోయిన ప్రశ్నల తాలూకు జవాబులు ఒక్కోటీ పదిసార్లు కాపీ రైటింగ్ రాసి ఉంది. నాలిక్కరుచుకున్నాడు శలభం. తన ప్రిపరేషన్ ప్రభావం వల్ల జరిగిన తప్పిదమది. పదిసార్లు సారీ చెప్పి ఫైలును సరిచేసేందుకు తన సీటుకు వెళ్లాడు.

"ఈ ముక్కేదో నీ లెక్చర్‌కు ముందే చెబితే పోయేదికదా! సో..నీవు రైట్ ట్రాక్‌లోనే ఉన్నావు. ఫోన్‌లు, ఎస్.ఎమ్.ఎస్‌ల సంగతి?"

"వాటికీ ఢోకా లేదు. ప్రయత్నిస్తూనే ఉన్నాను."

"గతంలో ఇలాంటి ప్రోగ్రామ్స్‌లో పాల్గొన్న ఓవ్యక్తి ఈమధ్య తారసపడ్డాడు. ఎన్నో విలువైన సూచనలు చెప్పాడు. అలా రెస్టారెంట్‌కు వెళ్లి మాట్లాడుకుందాం పద.."

జేబు తడుముకుంటూనే లక్ష్యసాధనలో ఇలాంటి ఇబ్బందులు సహజమని సర్దిచెప్పుకుని బయటకు అడుగులు వేశాడు శలభం.

చతుర తనదైన స్టైల్లో రెస్టారెంట్‌లో ఓ అరగంట అర్జంట్‌పనిని పూర్తి చేశాక కాని గొంతు విప్పలేదు.

"నువ్వు రోజూ ఏ న్యూస్‌పేపర్ చదువుతావు?" వేళ్లను నాకుతూ అడిగాడు.

"ఒకపేపర్ అనేముంది. ఇలా టీ, కాఫీలకొచ్చినప్పుడు హోటల్లో ఏది కనబడితే దాన్ని తిరగేస్తాను."

"అక్కడే పొరపాటు చేస్తున్నావు. నిన్న, మొన్న రోడ్‌పతి ప్రోగ్రామ్‌లో అడిగిన ప్రశ్నలు ఎక్కడివనుకున్నావు?"

"ఎక్కడివి?" ఒంగి ఆత్రుతగా అడిగాడు శలభం.

"న్యూస్ పేపర్స్‌లోవి.."

"ఆ..అవునా?"

"నిజం. అతను చెప్పింది కూడా అదే. న్యూస్ పేపర్స్‌ను రెగ్యులర్‌గా కూలంకషంగా చదివి నోట్స్ రాసుకోవాలన్నాడు."

"వీలవుతుందంటావా!"

వీలు చేసుకోవాలి. ఒక గొప్ప లక్ష్యాన్ని సాధించాలంటే ఎన్నింటినో త్యాగం చేయాల్సి ఉంటుంది కదా!"

"ఓకేరా. అలాగే చేస్తాను."

ఇక రోజూ నాలుగు రకాల దినపత్రికలను ఇంటికి తెప్పించుకోసాగాడు శలభం. తెల్లవారు ఝాము నాలుగుకు మొదలయ్యే షెడ్యూల్ రాత్రి పదకొండుకో, పన్నెండుకో ముగుస్తోంది.

బుక్స్ చదవడం, పేపర్లలోని ముఖ్యమైన న్యూస్ నోట్స్ రాసుకోవడం, పడుకోబోయే ముందు ద్రవ్యమణి ముందు చేతులు కట్టుకుని ఒప్పచెప్పడం.. ఇలా చాలా బిజీ అయ్యాడు శలభం.

ఆఫీస్‌కెళ్లినా అదే ధ్యాసలో ఉండసాగాడు. ఏ కాస్త ఖాళీ సమయం దొరికినా జికె బుక్స్ తిరగేయసాగాడు. మధ్య మధ్యలో ద్రవ్యమణి ఫోన్ చేసి ప్రశ్నలడిగి క్రాస్‌చెక్ చేస్తూ ఉంది.

ఓరోజు సెక్షన్ సూపరింటెండెంట్ నుంచి శలభానికి పిలుపొచ్చింది. ఆయన రూమ్‌లోకి వెళ్లాడు.

"కూర్చో."

"థాంక్యూ సర్."

"మీ బంధువులెవరైనా ఎర్రగడ్డ హాస్పిటల్లో ఉన్నారా?"

"లేరండి. దేనికి సార్?"

"నువ్వు వాళ్లను చూసేందుకు అప్పుడప్పుడూ వెళ్లొస్తుంటావేమోనని..!"

"మీకా అనుమానం దేనికొచ్చింది సార్?" కళ్లు మూసుకుపోకుండా బలవంతంగా ఆపుకుని నీరసంగా అడిగాడు.

"ఓసారి ఈ ఫైల్ చూడు. నీకే అర్థమవుతుంది." ఫైల్‌ను ముందుకు తోశాడాయన.

కాసేపు అది చూడగానే పరిస్థితి అర్థమయింది. ఆఫీస్ పేపర్ల వెనుకవైపు ఖాళీలో మణికి చెప్పలేకపోయిన ప్రశ్నల తాలూకు జవాబులు ఒక్కోటీ పదిసార్లు కాపీ రైటింగ్ రాసి ఉంది. నాలిక్కరుచుకున్నాడు శలభం. తన ప్రిపరేషన్ ప్రభావం వల్ల జరిగిన తప్పిదమది. పదిసార్లు సారీ చెప్పి ఫైలును సరిచేసేందుకు తన సీటుకు వెళ్లాడు.

ఇలా రకరకాల అపసవ్యాల మధ్య ప్రిపరేషన్ సవ్యంగానే సాగుతోంది. చతురతో రెస్టారెంట్లో మాట్లాడడం, మణి పరీక్షల్లో విజేతగా నిలవడం, ఆఫీస్‌లో అయోమయం, నిద్రలో జి.కె. బిట్స్ కలవరించడం, రెగ్యులర్ ఫోన్ కాల్స్, ఎస్ఎమ్ఎస్‌లు... శలభం జీవితంలో భాగమయ్యాయి.

ఓరోజు ఆఫీసులో ఫైల్ చూస్తూనే సగం కళ్లు తెరుచుకుని నిద్రపోసాగాడు. ప్రశాంతతను భగ్నం చేస్తూ కొత్తరింగ్‌టోన్ కర్ణకఠోరంగా కేకేసింది. కలలో అజిత్‌భాయ్‌తో కరచాలనం చేస్తోన్న వాడల్లా ఉలిక్కిపడి ఫోన్‌ను చెవికి ఆన్చాడు. అవతలి వారు చెప్పిన మాటలు వినగానే ఒక్కక్షణం మెదడు మొద్దుబారినట్లయ్యింది. జీవకణాలన్నీ ఒక్కక్షణం తమ క్రియల్ని ఆపి మరుక్షణం పుంజుకున్నాయి.

"యాహూ.." అని గట్టిగా కేకేశాడు.

స్టాఫంతా రెస్టారెంట్ల పూర్వజన్మ బాకీలు చెల్లిస్తూ ఉండబట్టి సరిపోయింది. లేకుంటేనా..కేక దెబ్బకు రక్తంకారి చెవుల్ని మూసుకుని ఆసుపత్రికి పరిగెత్తాల్సి వచ్చేది. మరి సామాన్యమైన విషయమా?

శలభం...రోడ్‌పతి ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు

ఎంపికయ్యాడు. క్షణాల్లో విషయం అందరికీ తెలిసి అభినందించారు. ఫోన్‌చేసి చతురకు, మణికి విషయం చెప్పాడు. ప్రశంసలు కుప్పలుగా వచ్చిప డ్డాయి.

ప్రోగ్రామ్‌కు ముంబాయి వెళ్లేందుకు ఇంకో వారం రోజులుంది. తనతోపాటు ఇంకొకరిని కూడా వెంట తెచ్చుకోవచ్చు.

ఇంకో నాలుగురోజుల్లో వెళతాడనగా చతుర పట్టుబట్టి మిత్రులందరికీ పార్టీ అరేంజ్ చేయిం చాడు. శలభానికి ఇష్టం లేదు. గెలుచుకొచ్చిన డబ్బుతో పార్టీ ఇస్తే సబబుగా ఉంటుందనుకు న్నాడు. కానీ, అందరూ పట్టుబట్టడంతో తప్పలేదు.

ఖర్చు ఇరవై వేలైంది. గుడ్డిలో మెల్లగా ప్రోగ్రా మ్‌కు వెళ్లొచ్చాక ఆ డబ్బు ఇస్తాడని రెస్టారెంట్ వాడికి చతుర హామీ ఇచ్చాడు. అజిత్‌భాయ్‌తో కలు స్తానన్న ఆనందం ఒకవైపు, ఇరవైవేల పార్టీ బిల్లు మరోవైపు మనసును ఆక్రమించుకోగా మెల్లగా ఇల్లు చేరాడు శలభం.

అతనికోసమే ఎదురుచూస్తు న్నట్లు వాకిట్లోనే ఉంది ద్రవ్య మణి.

''ఒకసారి నవ్వండి.'' అంది ఎలాగూ మొహంలో తర్వాత నవ్వుండదు. అని మనసులో అనుకుని బలవంతంగా మొహా న్ని నవ్వుమోడ్‌లోకి తెచ్చాడు.

''మీతోపాటు ముంబాయి రావాలి. అజిత్‌భాయ్‌ని పరి చయం చేసుకోవాలి. ఛానల్లో కన్పించాలి. అందుకే రిచ్‌గా ఉండాలని.'' అని టీపాయ్ పైని షాపింగ్ మెటీరియల్ చూసింది.

కారీబాగ్స్‌లోంచి వాటిని తీసి చూడకుండానే ప్రక్కనున్న బిల్లు తీశాడు శలభం. ''ఓ రవ్వల నెక్లెస్, నాలుగు పట్టుచీ రలే తీసుకుంది. వచ్చే పండక్కు కూడా ఇందులోనే సర్దుకుంటానులే.'' మణి మాటలు వినకుండానే టోటల్‌ఫిగర్ చూశాడు. గుండె గుభేల్ మంది. ఐదుపక్కన నాలుగు సున్నాలు. అంటే యాభై వేలు.

ఒళ్లంతా చెమటలు పట్టాయి.

''మీరేమీ టెన్షన్ పడొద్దు. పోటీకి ముందు టెన్షన్ పడితే తెలిసిన సమాధానాలు కూడా చెప్పలేకపో వచ్చు. మీరే బిల్లు గురించి ఆలోచించొద్దు. మనం ఖచ్చితంగా కోటి రూపాయలైనా గెలుస్తామన్న నమ్మకం నాకుంది.'' భర్తను ఓదార్చింది.

చిన్నప్పుడు పరీక్షలకు ముందు టెన్షన్‌పడి మార్కులు తగ్గిన సబ్జక్టులు గుర్తొచ్చాయి శలభానికి. అందుకే ప్రోగ్రామ్‌కు వెళ్లి వచ్చేంత వరకూ బాధకు, సుఖానికి అతీతంగా స్థితప్రజ్ఞుడిలా ఉండాలని మన సును రాయి చేసుకున్నాడు.

***

ముంబాయి వెళ్లడానికి రెండ్రోజుల ముందు ఫ్లైట్ టికెట్స్ కొరియర్‌లో వచ్చాయి. శలభం స్థితప్ర జ్ఞుడయ్యాడు కదా! అందుకే వాటిని చూడగానే ఎగిరి గంతేయలేదు. నిర్వికారంగానే ఉన్నాడు. మణికి కూడా దాన్ని సాధారణ విషయంలా చెప్పాడు. ఒక్కరోజులోనే విషయం చుట్టుప్రక్కలవా ళ్లకు, కొలీగ్స్‌కు, స్నేహితులకు తెలిసిపోయింది.

ఫ్లైట్ ఎక్కేరోజు అందరూ విమానాశ్రయానికి వచ్చారు. చేతులు చాచి, మూతులు సాగదీసి 'బెస్టా ఫ్‌లక్' చెప్పారు.

కొత్తపట్టుచీరలో ద్రవ్యమణి మెరిసిపోతోంది. కానీ, శలభమే సాధారణ దుస్తుల్లో ఒక చెంప నవ్వు, మరో చెంప విషాదాన్ని చూపుతున్నాడు. చతుర తట్టుకోలేకపోయాడు. సంతోష సమయంలో మౌన విషాదరాగం నచ్చలేదు. ఆపకుండా చక్కిలి గిలి పెట్టాడు. శలభానికి నవ్వక తప్పలేదు.

ఓ నాలుగు రోజుల తర్వాత బేగంపేట ఎయిర్ పోర్ట్ మళ్లీ సందడిగా మారింది. శలభం రోడ్‌పతి ప్రోగ్రామ్‌లో పాల్గొని వచ్చాడు. వెళ్లేటప్పుడు మణి




మొహంలో తాండవించిన సంతోషం ప్రస్తుతం లేదు. శలభం షరా మామూలే. స్థితప్రజ్ఞుడు కదా! ఆహ్వాన గుంపుకు నాయకుడైన చతురకేమీ పాలు పోలేదు. బహుశా సీక్రెసీ మెయింటెయిన్ చేస్తున్నాడ నుకున్నాడు. ప్రైజ్‌మనీ వివరాలు తనడిగినా చెప్ప దని భావించి శలభా ప్రోగ్రామ్ ఏరోజు వస్తుంది.'' పొదుపుగా అడిగాడు.

''వొచ్చే శుక్రవారం..'' అంతకు మించి ఒక్క మాట కూడా మాట్లాడక, ఆటో పిలిచి ఇంటికెళ్లిపో యాడు.

వచ్చిన మిత్రులందరికీ ఏమీ పాలు పోలేదు. తమ పనులకు, ఆఫీస్ పనులకు సెలవుపెట్టినా శలభం ప్రవర్తన వల్ల సార్థకత లభించలేదు. ఉస్సూ రుమనుకుంటూనే 'వీడి సంగతి ప్రోగ్రామ్ వచ్చాక చూద్దాం.' అనుకుని వెళ్లిపోయారు.

***

శుక్రవారం రాత్రి తొమ్మిదికి ప్రోగ్రాం మొదల యింది. ముందుగా వేగంగా సమాధానమిచ్చిన వారికి వేడి ఆసనం అవకాశం. ఆశ్చర్యం. శలభం అతివేగంగా సమాధానమిచ్చి అజిత్‌భాయ్ ఎదు రుగా ప్రశ్నలకు సిద్ధమయ్యాడు.

ఒక్కో ప్రశ్నకు అవలీలగా జవాబు చెప్పసా గాడు. ఒక్కోసారి స్క్రీన్‌పై నాలుగు సమాధానాలు రాకముందే జవాబు చెప్పేస్తున్నాడు. వరుసగా ఐదుప్రశ్నలకు జవాబిచ్చి ఇరవై వేలు గెలిచాడు. ఒక్క హెల్ప్ లైన్ కూడా తీసుకోలేదు. ఆరవ ప్రశ్న నుంచి తొమ్మిదో ప్రశ్న వరకు కూడా అదే స్పీడు. అజి త్‌భాయ్ ప్రశంసిస్తున్నాడు. టివి చూస్తోన్న వారంతా శలభం రెండుకోట్లు గెలిచే ఉంటాడని, కావాలనే ముఖం మాడ్చుకున్నాడని గట్టిగా నమ్మారు.

మూడులక్షలు గెలిచాడు. ఏడో ప్రశ్నకు జవాబిస్తే ఆరులక్షలు. ఆపై తప్పుచెప్పినా ఆరులక్షలు మిగులు తాయి. ఏడో ప్రశ్న కంప్యూటర్ తెరపైకొచ్చింది. ఏ ఒక్క హెల్ప్‌లైన్ తీసుకోకుండానే టక్కున జవాబి చ్చాడు శలభం. అజిత్‌భాయ్ ఒక టికి రెండు మార్లు మరీ మరీ అడిగి ఆ జవాబునే లాక్ చేశాడు. సరైన జవాబు బ్రేక్ తర్వాత చూసేవారిలో టెన్షన్ పెరిగిపోతోంది.

బ్రేక్‌తర్వాత మళ్లీ ప్రోగ్రామ్ మొదలు..

''శలబంజీ.. ఓ జవాబ్ గల్లత్ హై..'' అజిత్‌భాయ్ మాటల్లో సానుభూతి సెన్సెక్స్ భారీ స్థాయిలో పతనం. కేవలం ఇరవైవేల చెక్కుతో వెనుతిరి గాడు.

ప్రోగ్రామ్ చూస్తోన్న మిత్రు లంతా శలభం నిరాసక్త మొహం సహజ పరిణామమే అనుకున్నారు. చతురకైతే, 'ఓ మంచి పార్టీ మిస్సయ్యాం.' అన్న బాధ నరాల్ని పిండేసింది.

మరుసటిరోజు ఆఫీసులో అందరి ఊరడింపులూ అయ్యాక చతుర కూడా ఓదార్చాడు. 'స్థితప్రజ్ఞత' ఎటుపోయిందో. బావురు మంటూ చతుర చొక్కాకు కన్నీళ్ళు తుడుచుకున్నాడు శలభం.

ఇంతలో 'సార్..మీకో పోస్ట్..'' అంటూ శలభా నికో లెటర్ తెచ్చిచ్చాడు అటెండర్.

అది తీసి చూసిన వెంటనే దభీ మని బల్లపై పడి పోయాడు శలభం.

'ఏచావు కబురు మోసుకొచ్చిందో..' అనుకుని ఉత్తరం తీసి చూశాడు చతుర.

అది ఉత్తరం కాదు. శలభం సెల్‌ఫోన్ పోస్ట్‌పె యిడ్ బిల్. ఫోన్లు, ఎస్.ఎమ్.ఎస్.లు కలిసి ఓ యాభైవేలయ్యాయి.

'మూలిగే నక్కపై తాటిపండే ఇది. అయినా కోట్లు కావాలంటే లక్షలు ఖర్చుపెట్టకుంటే ఎలా...' అనుకుంటూ శలభం మొహంపై నీళ్లు చల్లి లేపే పని లోపడ్డాడు చతుర.